క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

సైదాబాద్: చెట్ల కొమ్మల తొలగింపు, విద్యుత్ సంబంధిత మరమ్మతుల కారణంగా ఆదివారం ఆస్మాన్‌ఘడ్ ట్రాన్స్‌కో డివిజన్ పరిధిలో కింద తెలిపిన ప్రాంతాల్లో విద్యుత్‌ఉండదని డీఈ హన్మంత్‌రెడ్డి తెలిపారు.

- ఉదయం 6 గంటల నుండి 9 గంటల వరకు.. ధోబీఘాట్ క్రాస్ రోడ్, హైటెక్ ఫంక్షన్ హాల్, స్కూల్ పరిసరాలు
- ఉదయం 8 గంటల నుండి 10 గంటల వరకు.. లక్ష్మీనగర్ క్రాస్ రోడ్, రామాలయం, వాణీనగర్, పటేలమ్మ మడిగ, ఆనంద్ బిస్కట్ ఫ్యాక్టరీ, ధోబీఘాట్ రోడ్ పరిసర ప్రాంతాల్లో కరెంట్ ఉండదని డీఈ తెలిపారు.

కూరగాయల ధరలు

దిల్‌సుఖ్‌నగర్: సరూర్‌నగర్/వనస్థలిపురం రైతు బజార్‌లలో.. (కిలో రూపాయల్లో) టమోటా 17. వంకాయ 23, బెండ 32, పచ్చిమిర్చి 37, కాకర 50, బీర 40, కాలీఫ్లవర్ 23, క్యాబేజీ 15, కారెట్ 37. దొండ 23, ఆలు 20, ఉల్లి 14, గోకర 40, దోస 15, సొర 09, పొట్ల 15, అరటి 10, చిక్కుడు 55, అర్వి 35, మునగ 45, చిలగడదుంప 40, బీట్‌రూట్ 19, కీర 19, ఫ్రెంచ్ బీన్స్ 85, కాప్సికమ్ 45. ఈ ధరలు ఆదివారం 9 గంటల వరకు మాత్రమే అమలులో ఉంటాయి.

నాలా నిర్మాణం పూర్తయినా మట్టి పోయరా?

హయత్‌నగర్: హయత్‌నగర్ బాతుల చెరువు కట్ట కింద ఉన్న కాలనీల గుండా వరద కాలువను నిర్మించినా చుట్టూ మట్టిని పోయకుండా వదిలేశారని, మట్టిని పోయకుంటే వచ్చే వర్షాకాలంలో స్థానికులు నడవలేని పరిస్థితి ఏర్పడుతుందని డివిజన్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డి అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం ఆయన అంబేడ్కర్ కాలనీ, ఆర్టీసీ మజ్దూర్ కాలనీ, తిరుమల కాలనీలలో ఆయన పర్యటించారు. నాలా నిర్మాణం కోసం ధ్వంసం చేసిన రోడ్లను తిరిగి నిర్మించాలని లేకుంటే ఆయా కాలనీలు బురదమయంగా మారుతాయన్నారు. అధికారులు వెంటనే స్పందించి నాలా చుట్టూ మట్టిని పోయాలని, ధ్వంసమైన రోడ్లను తిరిగి నిర్మించాలని ఆయన డిమాండ్ చేశారు.

తెలంగాణలో వైద్య విప్లవం: జూలూరి గౌరీశంకర్



పాణినీయ కళాశాల స్నాతకోత్సవంలో పాల్గొన్న జూలూరి గౌరీశంకర్ తదితరులు

చైతన్యపురి: తెలంగాణలో వైద్య విప్లవం మొదలయిందని తెలంగాణ సాహిత్య అకాడమీ చైర్మన్ జూలూరి గౌరీశంకర్ అన్నారు. గడ్డిఅన్నారం డివిజన్‌లోని పాణినీయ డెంటల్ కళాశాలలో జరిగిన స్నాతకోత్సవంలో జూలూరు ప్రత్యేక అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రాష్ట్రంలో 33 జిల్లాల్లో వైద్య కళాశాలలు నిర్మించే బృహత్తర కార్యక్రమం పూర్తి కాబోతుందన్నారు. రాబోయే పదేళ్లలో తెలంగాణ నుంచి వస్తున్న వైద్యుల సంఖ్య క్యూబా దేశంలోని డాక్టర్లను మించిపోయే దశకు చేరుకుంటుందన్నారు. ఎల్‌బీనగర్ డీసీసీ సాయిశ్రీ మాట్లాడుతూ... వైద్య వృత్తిలోకి అడుగు పెడుతున్న వారంతా ఉన్నత శిఖరాలు అధిరోహించి, ప్రజలకు వైద్యసేవలు అందించాలన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.కరుణాకర్, గురునానక్ విద్యా సంస్థల వైస్ చాన్సిలర్ జి.ఎస్.కోహిలి, మేనేజింగ్ డైరెక్టర్ హెచ్‌ఎస్ సైనీ, డెంటర్ సర్జరీ ఇంచార్జి డాక్టర్ జి.వి.రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వ్యర్థాల రీసైక్లింగ్‌తో పర్యావరణ పరిరక్షణ

చంపాపేట: ఒకసారి ఉపయోగించిన కాగితం, ప్లాస్టిక్, మెటల్, దుస్తులు, ఎలక్ట్రిక్ వంటి వ్యర్థాలను రీసైక్లింగ్ చేయటం వల్ల పర్యావరణ పరిరక్షణ సాధ్య పడుతుందని చంపాపేట కార్పొరేటర్ వంగ మధుసూదన్‌రెడ్డి అన్నారు. శనివారం చంపాపేట గాంధీ విగ్రహ చౌరస్తాలోని జీహెచ్‌ఎంసీ మల్టీపర్పస్ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన వ్యర్థాల సేకరణ కేంద్రాన్ని ఆయన సర్కిల్ శానిటేషన్ సిబ్బందితో కలసి ప్రారంభించారు. అనంతరం ఆయన పర్యావరణ పరిరక్షణకు చిత్తశుద్ధితో విధులు నిర్వర్తిస్తాం అని సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. జీహెచ్‌ఎంసీ పర్యావరణ పరిరక్షణ అధికారి మానస, సర్కిల్ శానిటేషన్ సిబ్బంది గణేష్, నరసింహ, సురేష్, శరత్, శేఖర్, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ డివిజన్ అధ్యక్షుడు రాజిరెడ్డికి మాతృ వియోగం



లక్ష్మమ్మ (ఫైల్)

చంపాపేట: బీఆర్‌ఎస్ పార్టీ చంపాపేట డివిజన్ అధ్యక్షుడు ముడుపు రాజిరెడ్డి మాతృమూర్తి, అప్పటి కర్మన్‌ఘాట్ గ్రామ పంచాయతీ మాజీ సర్పంచ్ ముడుపు లక్ష్మమ్మ శనివారం అనారోగ్యంతో మృతి చెందారు. ఎల్‌బీనగర్‌కు చెందిన పలువురు నాయకులు, కాలనీ సంక్షేమ సంఘ ప్రతినిధులు కర్మన్‌ఘాట్‌లోని ఆమె నివాసానికి తరలి వెళ్లి లక్ష్మమ్మ భౌతిక కాయానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చారు.

ప్రజలతో మమేకం.. సమస్యల సత్వర పరిష్కారం

13 సంవత్సరాలుగా కొనసాగుతున్న 'బస్తీ నిద్ర'

- జీహెచ్‌ఎంసీ అధికారులతో కలిసి పాదయాత్ర
- అప్పటికప్పుడే విన్నవించిన సమస్యల పరిష్కారం
- వీరన్నగుట్టను పుణ్యక్షేత్రంగా రూపుదిద్దుతా
- ఆరు నెలల్లో ప్రధాన రోడ్లను నిర్మిస్తాం
- ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి



వీరన్నగుట్ట బస్తీలో జెడ్‌సీ పంకజ, అధికారులు, బస్తీవాసులతో కలిసి పాదయాత్ర చేస్తున్న ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి



బస్తీలోని పేద ఇంట భోజనం చేస్తూ..

మన్సూరాబాద్: ప్రజలతో మమేకమై ప్రజా సమస్యలను తెలుసుకుని వీలైనంత త్వరగా పరిష్కరించేందుకు బస్తీ నిద్ర – బస్తీ బాతాఖానీ కార్యక్రమాన్ని చేపట్టామని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి స్పష్టం చేశారు. మన్సూరాబాద్ హయత్‌నగర్ పరిధి వీరన్నగుట్టలో బస్తీ నిద్ర కార్యక్రమాన్ని చేపట్టారు. ఇందులో భాగంగా శనివారం తెల్లవారుజాము నుంచి జీహెచ్‌ఎంసీ ఎల్‌బీనగర్ జోనల్ కమిషనర్ పంకజ, వాటర్‌వర్క్స్ జీఎం వినోద్‌కుమార్, హయత్‌నగర్ సర్కిల్ డీసీ మారుతీదివాకర్, ఇంజినీరింగ్, శానిటేషన్ అధికారులు, మాజీ కార్పొరేటర్ కొప్పుల విఠల్‌రెడ్డి, బీఆర్‌ఎస్ డివిజన్ అధ్యక్షుడు జక్కిడి మల్లారెడ్డిలతో కలిసి పాదయాత్రగా గల్లీ గల్లీ తిరిగి సమస్యలను తెలుసుకున్నారు. బస్తీలో నూతన వీధి దీపాలు, విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే ఆదేశించడంతో అధికారులు వెంటనే ఆయా పనులను చేపట్టారు. బస్తీలోని ఆలయాల వద్ద ప్రత్యేక పూజలు



వీరన్నగుట్ట బస్తీలో నిద్రపోతున్న ఎమ్మెల్యే దేవిరెడ్డి

నిర్వహించి పాదయాత్ర ప్రారంభించారు. వీరన్నగుట్ట బస్తీలోని ప్రతి గల్లీ తిరిగి బస్తీవాసులతో కలిసి అల్పాహారం, భోజనం చేసి సమస్యలు తెలుసుకొని రాత్రి బస చేశారు. 24 గంటలపాటు వీరన్నగుట్ట బస్తీలోనే గడిపారు. బస్తీవాసులతో పాటు సమీప కాలనీల ప్రజలు ఎమ్మెల్యేతో ముఖాముఖిగా తమ సమస్యలను విన్నవించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... బస్తీలోని ప్రతి గల్లీలో డ్రైనేజీ సమస్యను పరిష్కరించామని, ట్రంక్‌లైన్ పనులు తుది దశలో ఉన్నాయన్నారు.

ప్రతి ఇంటికీ తాగునీటిని అందించా...

గతంలో తాగునీటిని అనేక ఇబ్బందులు పడుతున్న వీరన్నగుట్ట బస్తీవాసులకు ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ప్రతి ఇంటికీ తాగునీటిని అందించానని ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి తెలిపారు. మురుగునీటి సమస్య తలెత్తకుండా భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకుని ప్రణాళికాబద్ధంగా డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటు చేశామన్నారు. అవసరమైన ప్రాంతాల్లో వీధి దీపాలు ఏర్పాటు చేయాలని అధికారులకు ఆదేశించినట్లు వివరించారు.

వీరన్నగుట్ట వీరులగుట్ట...

వీరన్నగుట్ట బస్తీలో సుమారు 560 కుటుంబాల్లో 2 వేల జనాభా ఉన్నారని ఎమ్మెల్యే పేర్కొన్నారు. వీరన్నగుట్ట వీరులగుట్ట అని తను మీ అందరి ఆశీస్సులు అందజేయాలని కోరారు. రూ. 2 కోట్లతో యూజీడీ పనులు, రూ. 96 లక్షలతో తాగునీటి పైప్‌లైన్లు, రూ. 57 లక్షలతో బస్తీ దవాఖానా, రూ. 44 లక్షలతో శ్రీ సీతారామాంజనేయ స్వామి ఆలయం నుంచి ఆకాష్‌నగర్‌కాలనీ వరకు సీసీ రోడ్డు నిర్మాణం, రూ. 10 లక్షలతో బస్తీలో కమ్యూనిటీ హాల్ నిర్మాణం, రూ. 8 లక్షలతో బస్తీలో మట్టిరోడ్ల నిర్మాణం, రూ. 2 లక్షలతో పోచమ్మగుడి ప్రాంగణంలో ప్లాస్టరింగ్, రూ. 1.50 లక్షలతో శ్రీ సీతారామాంజనేయ స్వామి ఆలయ ప్రాంగణంలో ప్లాస్టరింగ్ పనులు చేపట్టినట్లు ఆయన వివరించారు. బస్తీలో జీఓ 58, 59 ద్వారా మొదటి విడతగా 163 మందికి, రెండో విడతగా 70 మందికి పట్టాలు ఇచ్చామని దేవిరెడ్డి వెల్లడించారు.

రేషన్ షాప్, ప్రభుత్వ పాఠశాల ఏర్పాటుకు చర్యలు

బస్తీలోని సమస్యలపై ఎప్పటికప్పుడు దృష్టి సారించి మెరుగైన వసతులు కల్పిస్తున్నామని ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి అన్నారు. బస్తీలో దివ్యాంగులు ఎక్కువగా ఉంటారని, వీరు సదూర ప్రాంతం నుంచి రేషన్ తెచ్చుకోలేక ఇబ్బందులు పడుతున్నారని ప్రభుత్వంతో చర్చించి నూతన రేషన్ షాప్ ఏర్పాటుకు చర్యలు చేపడతానని తెలిపారు. ప్రభుత్వ పాఠశాల ఏర్పాటుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

వీరన్నగుట్టను పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దుతా

వీరన్నగుట్ట ప్రాంతాన్ని నిత్యం పర్యాటకులు వచ్చేలా అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. 9 ఎకరాల విస్తీర్ణంలో ప్రహరీ నిర్మాణానికి నిధులు మంజూరు చేయించానని స్పష్టం చేశారు. ప్రతి శివరాత్రికి లక్ష మంది భక్తులు వచ్చేలా వీరన్నగుట్టను తీర్చిదిద్దనున్నట్లు స్పష్టం చేశారు.

ఆరు నెలల్లో బస్తీలోని ప్రధాన రోడ్లు

వీరన్నగుట్ట బస్తీలోని ప్రధాన రోడ్ల నిర్మాణాన్ని ఆరు నెలల్లో పూర్తి చేస్తానని బస్తీవాసులకు ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. తాగునీరు, డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటు అయ్యిందని, కొన్ని పనులు చివరిదశలో ఉన్నాయన్నారు. అవి పూర్తికాగానే రోడ్డు నిర్మాణం చేపట్టనున్నట్లు తెలిపారు. వీరన్నగుట్ట బస్తీని ఆదర్శ బస్తీగా మార్చుతానన్నారు.

- కార్యక్రమంలో వీరన్నగుట్ట బస్తీ అధ్యక్షుడు కేకే ఎల్ గౌడ్, నాయకులు పోచబోయిన జగదీష్ యాదవ్, టంగుటూరి నాగరాజు, జక్కిడి రఘువీర్ రెడ్డి, ఆనంద్‌యాదవ్, కొసనం ధనలక్ష్మి వెంకట్‌రెడ్డి, జగదీష్‌గౌడ్, విజయ్‌భాస్కర్‌రెడ్డి, ఇరిగి రమేష్, వివిధ కాలనీల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

'మా పరిధిలో ఏం లేదు..'

చాదర్‌ఘాట్: జలమండలికి సంబంధించిన సమస్యలను గతంలో ఆశాఖ అధికారులు పరిష్కరించేవారు. బాధ్యత తీసుకునే వాళ్లు. సీవరేజ్, మ్యాన్ హోల్ మూతలు కుంగిపోయినా, కొత్త మ్యాన్ హోల్, వాటర్ పొల్యూషన్, లీకేజీలు తదితర సమస్యలపై గతంలో జలమండలి అధికారులు ప్రత్యక్షంగా పనులు చేసేవారు. ఇపుడు ఆ పరిస్థితి లేదని , రెండు సంవత్సరాలుగా జలమండలికి సంబంధించిన పనులు ఇనాముల్లాఖాన్ అనే కాంట్రాక్టర్‌కు అప్పచెప్పారని అతనికే ఫోన్ చేయాలని అధికారులు సూచించారు. ఏవైనా సమస్యలుంటే కాంట్రాక్టర్ నంబర్ 7842596607కు చేయాలని అధికారులు సెలవిచ్చారు.

కార్పొరేటర్ పర్యటన

సైదాబాద్: రహదారులపై వరదనీరు నిలవకుండా చర్యలు తీసుకోవాలని బీజేపీ భాగ్యనగర్ జిల్లా ఉపాధ్యక్షుడు జంగం మధుకర్‌రెడ్డి అధికారులను కోరారు. శనివారం ఆయన జీహెచ్‌ఎంసీ అధికారులతో కలిసి ఐఎస్‌సదన్ డివిజన్ పరిధిలోని పవనపురి కాలనీలో పర్యటించారు. చిన్నపాటి వర్షం కురిసినా వరదనీరు కాలనీలోని అంతర్గత రహదారులపై నిలిచిపోతోందని ఆయన వివరించారు. సమస్య పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ ఈఈ బస్వరాజ్, ఏఈ అన్సారీ, కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

జన్మదిన వేడుకలు



మార్కెట్ ఎస్జీఎస్ దామోదర్‌ను సత్కరించిన పాలకవర్గం

చాదర్‌ఘాట్: మార్కెట్ అభివృద్ధికి నిరంతరం శ్రమిస్తానని మలక్‌పేట మార్కెట్ ఎస్జీఎస్ దామోదర్ తెలిపారు. శనివారం మార్కెట్ కార్యాలయంలో ఆయన జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. మార్కెట్ కమిటి చైర్‌పర్సన్ అనితనాయక్, వైస్‌చైర్మన్ భూమేష్, డైరెక్టర్‌లు ఆయనను గజమాలతో సత్కరించారు. మార్కెట్ సిబ్బంది ఆయనతో కేక్ కట్ చేయించారు.

హ్యాండ్లూమ్ మేళాకు ప్రజాదరణ



మేళాలో కొనుగోలుదారుల సందడి

వనస్థలిపురం: వనస్థలిపురంలోని హుడా ఓపెన్ ఆడిటోరియంలో గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన ఆల్ ఇండియా హ్యాండ్లూమ్ అండ్ హ్యాండీ క్రాఫ్ట్ మేళాకు ప్రజలు ముఖ్యంగా మహిళల నుంచి అనూహ్య స్పందన లభిస్తోంది. మేళాలో కొలువైన దుస్తులు, తదితర వస్తువుల కొనుగోలుకు స్థానికులు ఆసక్తి చూపిస్తున్నారు. మంగళగిరి, ఉప్పాడ, వెంకటగిరి, భాగల్‌పూర్, డిజైనర్, కాంతా వర్క్స్, హ్యాండ్ బ్లాక్ ప్రింటెడ్, లినెన్, కలంకారీ, బెంగాల్ కాటన్, లక్నో చికాన్, బనారస్ చీరలు, లేడీస్ ఫ్యాన్సీ టాప్స్, డిజైనర్ బ్లౌజెస్, ఖాదీ మెటీరియల్, వన్ గ్రామ్ గోల్డ్ నగలు, జైపూర్ బెడ్ షీట్స్, కొండపల్లి బొమ్మలు, గాజులు, హైదరాబాద్ ముత్యాలు, బ్యాగులు, చెప్పులు తదితర ఉత్పత్తులు తగ్గింపు ధరలకు లభిస్తాయని మేళా నిర్వాహకులు అక్బర్ అలీ తెలిపారు. ఈ అవకాశం కొద్ది రోజులు మాత్రమే ఉంటుందని ఆయన పేర్కొన్నారు.

మోదీ చేసిన అభివృద్ధిని ప్రజల్లోకి తీసుకెళ్లాలి

- బీజేపీ భాగ్యనగర్ జిల్లా అధ్యక్షుడు సంరెడ్డి సురేందర్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు సురేందర్‌రెడ్డి

సైదాబాద్: దేశ ప్రధాని నరేంద్రమోదీ సారథ్యంలో అమలు చేస్తున్న పలు సంక్షేమ పథకాలను బీజేపీ నాయకులు, కార్యకర్తలు ప్రజలకు వివరించాలని ఆ పార్టీ భాగ్యనగర్ జిల్లా అధ్యక్షుడు సంరెడ్డి సురేందర్ రెడ్డి సూచించారు. మోడీ తొమ్మిదేళ్ల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా ఈనెల 30 నుండి జూన్ 30 వరకు నిర్వహించే మహాజన్ సంపర్క్ అభియాన్ ద్వారా పార్టీ నాయకులు, కార్యకర్తలు ఇంటింటికి వెళ్లి కేంద్ర ప్రభుత్వ పథకాలపై ప్రచారం చేయాలన్నారు. శనివారం హైదరాబాద్ నగర కార్యాలయంలో నిర్వహించిన వ్యవస్థా బైఠక్ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈనెల 22న చంపాపేటలోని సామ సరస్వతి కన్వెన్షన్ హాల్‌లో నిర్వహించనున్న బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సమావేశం గురించి చర్చించారు. పార్టీ జాతీయ నాయకులు పాల్గొనే కార్యవర్గ సమావేశం విజయవంతం చేయడానికి నాయకులు కృషి చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో నగర మాజీ డిప్యూటీ మేయర్ సుభాష్ చందర్జీ, ఐఎస్ సదన్ డివిజన్ కార్పొరేటర్ జంగం శ్వేతమధుకర్‌రెడ్డి, మూసారాంబాగ్ కార్పొరేటర్ భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

మెరుగైన తాగునీటి సరఫరాకు చర్యలు

- కార్పొరేటర్ కొత్తకాపు అరుణరవీందర్‌రెడ్డి



వాటర్‌వర్క్స్ అధికారులతో కలిసి పర్యటిస్తున్న కార్పొరేటర్ అరుణరవీందర్‌రెడ్డి

సైదాబాద్: వేసవి కాలంలో ఇబ్బందులు తలెత్తకుండా మెరుగైన తాగునీటి సరఫరాకు చర్యలు తీసుకుంటున్నామని సైదాబాద్ డివిజన్ కార్పొరేటర్ కొత్తకాపు అరుణరవీందర్‌రెడ్డి తెలిపారు. శనివారం కార్పొరేటర్ వాటర్‌వర్క్స్ అధికారులతో కలిసి సైదాబాద్‌లోని ఎల్‌ఐసీ కాలనీలో పర్యటించారు. కాలనీలో తరచూ కలుషిత నీరు సరఫరా అవుతుందని స్థానికులు వారి దృష్టికి తేగా సమస్య పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని కార్పొరేటర్ అధికారులకు సూచించారు. అదేవిధంగా కాలనీలో మ్యాన్‌హోల్‌ల మధ్య దూరం ఎక్కువై మురుగు పారుతున్నందున వాటి మధ్యలో అదనపు మ్యాన్‌హోల్‌లు నిర్మించాలని ఆదేశించారు. కార్యక్రమంలో మలక్‌పేట వాటర్‌వర్క్స్ డీజీఎం షీలారాణి, వర్కింగ్ ఇన్‌స్పెక్టర్ మనోహర్, సీవరేజ్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

ప్రారంభ దశలోనే సమస్యను గుర్తిస్తే చికిత్స సులభం



అకాడమీ ప్రిన్సిపల్ డాక్టర్ బాబుతో అనిబీసెంట్ కాలేజ్ విద్యార్థులు

మలక్‌పేట: ఆటిజం అనేది వ్యాధికాదని మానసిక రుగ్మత అని సైకాలజికల్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఎం.ఏ కరీమ్ అన్నారు. సికింద్రాబాద్ స్వీకార్ అకాడమీ ఆఫ్ రిహాబిలిటేషన్ సైన్సెస్ వారు శనివారం 'ఆటిజం' పై నిర్వహించిన పోటీలలో దిల్‌సుఖ్‌నగర్ అనిబీసెంట్ మహిళ కాలేజ్ విద్యార్థులు ప్రథమ, ద్వితీయ బహుమతులు సొంతం చేసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పిల్లలలో మానసిక ఎదుగుదల సమస్యలను, మానసిక లోపాలను ప్రారంభ దశలోనే గుర్తించి మానసిక రోగ వైద్యుల పర్యవేక్షణలో చికిత్స అందించవచ్చన్నారు. అకాడమీ ప్రిన్సిపాల్ డాక్టర్ బాబు పోస్టర్ ప్రజెంటేషన్‌లో విజేతలైన వారికి బహుమతి ప్రదానం చేశారు. కాలేజ్ సెక్రటరీ డాక్టర్ శ్యామ్ సుందర్‌రెడ్డి, వైస్ ప్రెసిడెంట్ దయాకర్‌రెడ్డిలు ప్రతిభ చాటిన సైకాలజీ విద్యార్థులు శివానీ, సాహితీ, మేఘన, సైకాలజీ విభాగం లెక్చరర్ యశోదను అభినందించారు.

గ్రీన్ ఇండియా చాలెంజ్‌లో ఉప్పల

నాగోలు: ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు, తెలంగాణ రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్‌గుప్తా సతీమణి, ఉప్పల ఫౌండేషన్ కో చైర్‌పర్సన్ ఉప్పల స్వప్న జన్మదినం సందర్భంగా నాగోలులోని ఉప్పల శ్రీనివాస్‌గుప్తా నివాసంలో శనివారం గ్రీన్ ఇండియా చాలెంజ్‌లో భాగంగా మొక్కలు నాటారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... గ్రీన్ ఇండియా చాలెంజ్ రూపకర్త రాజ్యసభ సభ్యుడు జోగినపల్లి సంతోష్ కుమార్ పిలుపు మేరకు పుట్టినరోజు సందర్భంగా మొక్కలు నాటినట్లు తెలిపారు. అనంతరం పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు.

కొత్తపేటను పరిశుభ్రంగా చేయడమే లక్ష్యం

నాగోలు: కొత్తపేట డివిజన్‌ను క్లీన్–గ్రీన్‌గా తయారు చేయడమే తన ప్రధాన లక్ష్యమని కార్పొరేటర్ నాయికోటి పవన్‌కుమార్ అన్నారు. శనివారం సత్యానగర్ కాలనీలో జీహెచ్‌ఎంసీ సిబ్బంది, అధికారులతో కలసి మేరీలైఫ్.. మేరా స్వచ్ఛ షహర్ ప్రచార కార్యక్రమం, శానిటేషన్ స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా కార్పొరేట మాట్లాడుతూ... కాలనీల్లో పేరుకుపోయిన ప్లాస్టిక్ బాటిల్లు, కవర్లు, పుస్తకాలు, పేపర్లన్నింటినీ రీసైకిల్ చేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. కొత్తపేటను పరిశుభ్రంగా ఉంచేందుకు కలిసికట్టుగా పనిచేయాలని ప్రమాణం చేశారు. సత్యానగర్ కాలనీ అధ్యక్షుడు శుక్లా, రవికుమార్, జవాన్ లక్ష్మయ్య, రాంకీ సంస్థ విజయభారతి, ఎస్ఎఫ్ఏ ప్రేమ్, శివ కుమార్ పాల్గొన్నారు.

పార్కు స్థలాలు అన్యాక్రాంతం

మన్సూరాబాద్: డివిజన్ పరిధిలోని పలు కాలనీలలో పార్కు స్థలాలు కబ్జా అవుతున్నా జీహెచ్‌ఎంసీ హయత్‌నగర్ సర్కిల్ టౌన్ ప్లానింగ్ అధికారులు పట్టించుకోవటం లేదని జీహెచ్‌ఎంసీ బీజేపీ డిప్యూటీ ఫ్లోర్‌లీడర్, మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి ఆరోపించారు. డివిజన్ హయత్‌నగర్ పరిధి ప్రగతీనగర్‌కాలనీ ఫేజ్–1లో కార్పొరేటర్ మార్నింగ్ వాక్ చేపట్టి సమస్యలు తెలుసుకున్నారు. కాలనీవాసులు పార్కు స్థలం కబ్జాకు గురవుతోందని కార్పొరేటర్ దృష్టికి తీసుకొచ్చారు. స్పందించిన ఆయన మాట్లాడుతూ... ప్రస్తుం పార్కు స్థలంగా పేర్కొంటున్న అధికారులు... టౌన్ ప్లానింగ్ అధికారుల మాయాజాలంతో ప్రభుత్వ స్థలాలు కబ్జాకు గురవుతున్నాయని విమర్శించారు. పార్కు స్థలాలకు ప్రహరీలు నిర్మించాలని కోరినా, నిధులు మంజూరు చేయించినా అధికారులు నిమ్మకు నిరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాలనీ నేతలు నర్సింహ్మాయాదవ్, ప్రతాప్‌రెడ్డి, మహేందర్, లక్ష్మి, జగన్, దేవేందర్, అనిత, పద్మ, సరోజ, శకుంతల, నాయకులు కడారి యాదగిరియాదవ్, సాయిరాంగౌడ్, కోటయ్య, రమేష్‌చారి తదితరులు పాల్గొన్నారు.



మూసీలో కబ్జాలపై ఉక్కుపాదం

- నదిలోని అక్రమ నిర్మాణాల తొలగింపు
- కబ్జాలకు పాల్పడితే క్రిమినల్ కేసులు
- ఉప్పల్ తహసీల్దార్ గౌతమ్ కుమార్



మూసీ పరీవాహక ప్రాంతంలో అక్రమ నిర్మాణాలను కూల్చివేస్తున్న రెవెన్యూ అధికారులు

నాగోలు: మూసీ నదిలో వెలసిన అక్రమ నిర్మాణాలపై రెవెన్యూ అధికారులు ఉక్కుపాదం మోపుతున్నారు. కబ్జాలకు పాల్పడే వారెవరైనా ఉపేక్షించమని హెచ్చరిస్తున్నారు. అందులో భాగంగా శనివారం మూసీ ప్రాంతంలో కొత్తపేట్ రెవెన్యూ గ్రామ పరిధిలోని సర్వే నెం. 52లో టెన్నిస్ కోర్ట్ పేరుతో నిర్మిస్తున్న అక్రమ నిర్మాణాలను జీహెచ్‌ఎంసీ సరూర్‌నగర్ సర్కిల్ అధికారులు, చైతన్యపురి పోలీసుల సహకారంతో అక్రమ నిర్మాణాలను జేసీబీ సహాయంతో తొలగించారు. మూసీ నదీ పరీవాహక ప్రాంతం, బఫర్ జోన్‌లో వ్యర్థాలను డంప్ చేసినా, అక్రమ కట్టడాలు నిర్మించినా, కబ్జాలకు యత్నించినా క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని ఉప్పల్ తహసీల్దార్ కె.గౌతమ్ కుమార్ హెచ్చరించారు. కబ్జాలను పరిశీలించిన గౌతమ్‌కుమార్ మాట్లాడుతూ... మూసీలో కబ్జాలకు పాల్పడితే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఇక్కడ అక్రమ నిర్మాణాలు చేస్తే చర్యలు తప్పవని అన్నారు. కార్యక్రమంలో మండల గిర్దావర్ సుధ, టౌన్ ప్లానింగ్ సెక్షన్ అధికారి కిష్టయ్య, వీఆర్‌ఏలు నాగలక్ష్మి, స్వామి, జీహెచ్‌ఎంసీ, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

గుంటి జంగయ్య సేవలు చిరస్మరణీయం

హస్తినాపురం: ఎల్‌బీనగర్ ప్రాంత అభివృద్ధికి మన్సూరాబాద్ సర్పంచ్‌గా, స్థానిక వార్డు కౌన్సిలర్‌గా స్వర్గీయ గుంటి జంగయ్య చేసిన సేవలు మరువలేనివని టీ పీసీసీ డెలిగేట్, ఎల్‌బీనగర్ నియోజక వర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి జక్కిడి ప్రభాకర్‌రెడ్డి కొనియాడారు. దళితనాయకుడు గుంటి జంగయ్య 16వ వర్ధంతిని గుంటి జంగయ్యనగర్ కాలనీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. జంగయ్య విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

చెత్త డంపింగ్ సమస్య పరిష్కారానికి కృషి

చంపాపేట: యాదగిరినగర్ కాలనీలో ఖాళీగా ఉన్న పార్కు స్థలం చెత్త డంపింగ్‌గా మారిందని... ఎంపీ రేవంత్‌రెడ్డి సహకారంతో ఆ స్థలాన్ని పార్కుగా తీర్చిదిద్ది సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతానని కాంగ్రెస్ పార్టీ ఎల్‌బీనగర్ ఇన్‌చార్జి మల్‌రెడ్డి రాంరెడ్డి తెలిపారు. శనివారం ఆయన కాలనీవాసుల విజ్ఞప్తి మేరకు కాలనీలో పాదయాత్ర నిర్వహించి రోజుల తరబడి తరలింపునకు నోచుకోని చెత్త కుప్పలు, గుంతలుగా మారిన కాలనీ అంతర్గత రహదారులు, సీసీ కెమెరాల లేమి, వేలాడే విద్యుత్ తీగలు వంటి సమస్యలను పరిశీలిచారు. అనంతరం స్థానికులు రాంరెడ్డికి కాలనీ సమస్యలు పరిష్కరించాలంటూ వినతి పత్రం అందచేశారు. కార్యక్రమంలో పార్టీ డివిజన్ అధ్యక్షుడు దాచర్లపల్లి శ్రీపాల్‌రెడ్డి, నేతలు మెగిలిపువ్వు నారాయణ, కిరణ్, చిరంజీవి, శివ, వెంకటేష్, రాము, రణధీర్‌రెడ్డి, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



మల్‌రెడ్డి రాంరెడ్డికి వినతి పత్రం అందజేస్తున్న కాలనీవాసులు

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9666021515
9505507616
9912220363
9912220365